# ఇది కూడా ఒక నవ్వే!

శంఖవరం సరోజా సింధూరి


"**కేవలం** ఒక్క నీటిచుక్క. ఒకే ఒక్క కన్నీటి చుక్క. కానీ, ఆ నీటిచుక్క ప్రతిఫలించే రంగుల ధగధగల్లో ఎంతటి విశ్వవ్యాప్తమైన ప్రేమ. పారదర్శకమై మిల మిల మెరిసే దాని అంతరంగాన ఎంతటి బలవత్తరమైన వాంఛ. స్వచ్ఛమై, ముత్యమై విడిసి పడే దాని సౌందర్య ప్రభలలో మరెంతటి దైవత్వం దాగి ఉన్నాయి!

భగవంతుడే కనక ప్రేమను సృజించి ఉంటే ఆ ప్రేమలోని మధుర భావాన్ని, అది విరజిమ్మే మహత్తరమైన కాంతి కిరణాలకీ, ఆ ప్రేమకున్న దైవత్వాన్ని, ఆయన ఒకేఒక్క అశ్రుబిందువుకూడా ప్రత్యక్షపరిచి ఉంటాడు." మైత్రి చెవిలో ఎవరో గుసగుస లాడుతున్నారు.

గుండెల్లోని వెల్లువ కళ్ళలో పొర్లి తిరిగి రెప్పల అంచులనుంచి చప్పున జారి చెక్కిలి మీటుకుంటూ హృదయాన్ని దాటుకుని చటుక్కున వడిలో రాలిన నీటిబిందువునే చూస్తోంది మైత్రి.

ఒకటి. రెండు. మూడు. పది. ఆమె కంటి కొసలనుంచి అశ్రువులు మంచి ముత్యాల్లా దొర్లుతూనే ఉన్నాయి.

ఒకరి కోసం ఒకరి మనసు ఎంతగా ద్రవిస్తే, మరెంతగా స్పందిస్తే రాలుతుం దీ నీటిబొట్టు! హృదయాని కెంత గాయం తగిలితే జారుతుందీ బాష్పబిందువు!



లైఫ్ సైజు ఫోటోలోంచి సుమిత్ర ఎందుకో చిరునవ్వు నవ్వుతూంది. ఆమె పక్కనే అదే సైజులో ఉన్న మరో ఫోటోలోని రఘురామ్ చూపు లెందుకో జాలిగా ఉన్నాయి. ఆ ఫోటోల ముందు వెలిగించిన వూదొత్తులు చివరంటా కాలి ఆరిపోయాయి. నిన్ననగా అలంకరించిన మందారాలు వాడి వత్తలై పోయాయి.

మైత్రి మెల్లగా లేచింది. కాలిపోయిన వూదు ఒత్తులు, వాడిన మందారాలు తీసి వేసి ఆ రోజ పూచిన పూలతో అలంకరించింది. అగరుబత్తిని వెలిగించింది. ఆ ఫోటోల కెదురుగా ఉన్న సోఫాలో కూర్చుంది.

ఆమె కళ్ళు తదేకంగా ఆ మూర్తుల నే చూస్తున్నాయి. ఆమె చూపులు విచ్చుకత్తుల్లా ఫోటో ఫ్రేమ్‌లోకి చొచ్చుకు పోతున్నాయి.

"మమ్మీ!" మైత్రి పెదవులు అస్పష్టంగా కదిలాయి.

ఆమె చుట్టూ ఘోరమైన నిశ్శబ్దం. అది ఈ నాటిది కాదు. రెండేళ్ళనుంచీ ఆ నిశ్శబ్దం ఆమె హృదయాన్ని పడిసి పట్టుకుంది. ఏ క్షణాన పెళ్ళున బద్దలై ఆమెను కబళిస్తుందో!

"మమ్మీ! నువ్వు పోతే నేను సుఖపడతాననుకున్నావు! ఎంత పిచ్చిదానివి. మమ్మీ! నువ్వు లేకున్నా నా బతుకు పాట ఒకటే. కనీసం నువ్వుంటే నీ వడిలో తల దాచుకుని సేద తీరే భాగ్యమన్నా ఉండేది. నీ గుండెల్లో ఒదిగిపోయి మనసు విప్పుకునే అదృష్టమన్నా మిగిలేది. కానీ. కానీ. నన్ను దిక్కు లేని దాన్ని చేసి వెళ్ళి పోయావు. మమ్మీ! డాడీకి నా కంటే నువ్వంటేనే ఇష్టం. అందుకే, డాడీకూడా నన్నొంటరిగా వదిలేసి నీ దగ్గరకే వచ్చేశాడు. చూడు. నీ పక్కనే నిలబడి ఎంత గర్వంగా చూస్తున్నాడో! ఓహో! డాడ్ యువార్ సెల్ఫిష్." మైత్రి కళ్ళనుంచి టపటపా రాలుతున్నాయి కన్నీటి చినుకులు.

"మైత్రీ!" ఎవరిదో పిలుపు.

ఉలిక్కి పడి చూసింది మైత్రి.

"ఓ. వృజన్!" ఆమె పెదవులు అప్రయత్నంగా అతని నామాన్ని ఉచ్చరించాయి.

వృజన్ మెల్లగా—అతి మెల్లగా వచ్చి మైత్రి ఎదుట కూర్చున్నాడు.

వృజన్ చూపులు మైత్రి ఎదలోకి, మైత్రి చూపులు ఏమీ లేని శూన్యంలోకి.

"మైత్రీ!" అతని మాట నిండా మార్దవం. "సారీ. ఎక్స్ట్రీమ్‌లీ సారీ. ఫర్‌గివ్ మీ."

మైత్రి చివుక్కున చూసింది అతని వైపు. "లేదు. లేదు. మిమ్మల్ని మోసం చేసిన వంచకిని. నీచురాల్ని. నేనే మీకు అపాలజీ చెప్పుకోవాలి."

"మైత్రీ!" దెబ్బ తిన్నట్టు చూశాడు.

"ఇంకా మన మధ్య మైత్రి ఎక్కడ?" మైత్రి చిత్రంగా నవ్వింది.

వృజన్ మౌనంగా తల దించుకున్నాడు. రెండు నిమిషాల తరవాత అన్నాడు.

"మైత్రీ! సడన్‌గా ఆ వార్త వినడంతో విచక్షణ నశించింది. సాధారణ మానవుణ్ని. రూమర్స్ విని రూమర్స్ గానే తీసుకోలేని బలహీనుణ్ని."

మైత్రి చప్పున అతని వంక తిరిగి అన్నది. "అంటే ఇది వట్టి పుకారనీ, నిజం కాదనీ నమ్ము తున్నావా?"

"నీ తోడు, మైత్రీ! ఇది కేవలం ఒక నీలివార్త అని నమ్ముతున్నాను. నా హృదయ పూర్వకంగా నమ్ముతున్నాను." అతని కళ్ళలో ఏదో తృప్తి తళుక్కు మెరిసింది.

"కానీ. నేను చెబుతున్నాను. స్వయంగా చెబు తున్నాను. విను ఇది గాలివార్త కాదు. పచ్చి నిజం." ఆమె కంఠం పిడుగుపాటులా ఉంది.

"మైత్రీ!" షాక్ తిన్నట్టు అన్నాడు.

"యస్. ఇట్స్ ట్రూ. మమ్మీకి. అమ్మకు లె. ప్ర. సీ."


వృజన్ ఎలెక్ట్రిక్ ఫెన్సింగ్‌ను తాకినట్టు ఉలిక్కి పడ్డాడు.

మైత్రి ఉద్వేగంగా అన్నది—

"అందుకే. నా జీవితానికి తాను ప్రతిబంధకం కాకూడదనే అమ్మ ఆత్మహత్య చేసుకుంది. నాకు తోడుగా డాడీ ఉంటారనుకుందేమో! కానీ, కానీ డాడీ నన్ను మోసం చేశారు. అమ్మను వెదుక్కొస్తా నని చెప్పి వెళ్ళటం. ఇక తిరిగి రాలేదు. నేను మిగిలాను. నా కోసం కన్నీళ్ళు మిగిలాయి." మైత్రి నయనా ల్లోని కారుమేఘాలు కరిగి నీరై కురుస్తున్నాయి. రెండు చేతులతో ముఖం కప్పుకుని వెక్కి పడుతూంది.

వృజన హృదయాంతరాళాల్లోంచి ఒకలాంటి బాధ ... సన్నని మంటలా మొదలయ్యింది. అతని హృదయాధి దేవత దుఃఖం చూస్తుంటే ... మనసు ముక్కలే అవుతోంది. ఆర్తిగా ఆమెను గుండెలోకి పొదువుకోవాలని ... తన పెదవులతో ఆమె కన్నీరు నద్దాలని ... అతని అంతరంగం ఉరకలు వేస్తోంది. పరుగులు తీస్తోంది. కానీ ... మరేదో శక్తి అతన్ని నొక్కి పడుతోంది.

"నిన్నటివరకు ... నా కళ్ళలో నీటి బిందువు




కనిపిస్తే తల్లడిల్లిపోయే వృజన్‌వేనా నువ్వు?" మాటిగా అతనివంక చూసింది. ఆమె కళ్ళు తడిసిన మంకెన పువ్వులే.

వృజన్ కళ్ళలో ... తడబాటు.

"హు ... కావు. కానేకావు. ఈ క్షణంనుంచీ నువ్వెవరో. మన బాట రెండుగా చీలిపోయింది ఆ బాటలు సమాంతర రేఖలు. ఇక కలవ్వు." ఆమె పెదవులు అస్పష్టంగా కదిలాయి. ఆమె చూపులు అనంతంలోకి దూసుకు పోతున్నాయి. దిగంతాలను చీల్చివేస్తున్నాయి.

"మైత్రీ! ఎంత మోసంచేశావ్! మీ అమ్మకు కుష్ఠురోగమని తెలియక నిన్ను ప్రేమించాను. అందుకా ఏమిటో లోకులు కాకులు అని ఈ సంఘాన్ని వెక్కిరిస్తారు. కానీ ... ఆ లోకులు మాటల్లో కూడా ఒక్కోప్పుడు కఠోర సత్యాలు వెలికి వస్తుంటాయి. నిన్ను పెళ్ళిచేసుకుందా మను కున్నాను. మై గుడ్‌నెస్! గాడ్ ఈజ్ గ్రేట్. నన్ను రక్షించాడు. లేకుంటే ... లేకుంటే ఒక లెప్రసీ పేషెంట్ కూతుర్ని ..."

"వృజన్! స్టాపిట్ ..." ఉద్రేకంతో ... ఉద్వే గంతో మైత్రి కంఠనాళాలు తెగిపోయాయి.

అంతవరకూ మౌనంగా ... శూన్యంగా ఆమెనే చూస్తున్న వృజన్ ఉలిక్కిపడ్డాడు. "మైత్రీ! ఏమిటి? ఏమైంది?"

" ... ఇది నిన్న కాదుగదూ! నేడు."

పిచ్చిగా నవ్వి అతన్నే గుచ్చిచూస్తూ అన్నది.

"నిన్న నువ్వన్న మాటలు ... కాదు ... కాదు నువ్వు విసిరిన ఈటెలు ... నా గుండెను రక్తసిక్తం చేస్తుంటే బాధ భరించలేక కేకలు వేస్తున్నాను ... కేకలు."

అతను బాధగా నుదురు రాచుకున్నాడు.

"సారీ అన్నాను కదా!"

"అవును కదూ! 'సారీ' చెప్పావు. ఎంత గొప్పపని చేశావు!" ఆమె స్వరంలో హేళన.

"మైత్రీ! ఆవేశం మనిషిని పశువును చేస్తుంది. ఉద్రేకాలకూ, ఉద్వేగాలకూ అతీతంగా ఉండడానికి నేను దేవుణ్ని కాదు... కేవలం మనిషిని" కొంచెం పరుసుగా అన్నాడు.

"దేవుడికి దైవత్వముంటుంది. మనిషికి మానవత్వ ముంటుంది. మరి నువ్వూ మనిషివే. నీలో మానవత్వ ముందా? ఉంటే అంత కఠినంగా మాటాడేవాడి వేనా?" మైత్రి మాటిగా చూసింది.

"ఉంది. నాలో మానవత్వ ముండబట్టే మళ్ళీ నీ దగ్గర కొచ్చాను."

"పొగడుకుంటున్నావా? సెల్ఫ్ ప్రైజింగ్ ..." నవ్వింది.

"వాటెవర్ యు థింక్ ...ఐ డోంట్ ఫీల్. కానీ ... నే చెప్పేది ఎగతాళిగా కాక హృదయ పూర్వ కంగా విను. నేను కొన్ని విషయాలు అడుగుతాను. ఫ్రాంక్‌గా సమాధానాలు చెప్పగలవా?"

"చెప్పగలను."

"మీ అమ్మగారు చనిపోయి ఎన్నాళ్ళయింది?"

"మానిన గాయాన్ని రేపుతున్నావా?" బాధగా చూసింది.

"ప్లీజ్ ..." అతను అర్థింపుగా చూశాడు.

"రెండేళ్ళు దాటాయి. మూడో సంవత్సరం రన్నవుతోంది."

"ఆమెకు ఆ జబ్బు ఎప్పుడు ఎటాక్ అయింది? ఆఫ్టర్ యువర్ బర్త్ ... ఆర్ బిఫోర్ ...?"

"ఐ సీ. మీ సందేహం నా కర్థమయింది. ఇక మీరేమీ అడగక్కర్లేదు. అంతా నేను చెబు తాను. ఐ మస్ట్ టెల్ యు ఎవ్వరిథింగ్ ..." మైత్రి వేలి కొసంతో పెదవులు రాచుకుంటూ కాసేపలా ఉండి పోయింది.

వృజన్ ఆత్రతగా చూస్తున్నాడు ఆమెవంక.

చాలాసేపటికి ఆమె పెదవులు విచ్చుకున్నాయి. మమ్మీ ఫోటో మీద దృష్టి నిలిపి అన్నది:

"మా అమ్మ ఆగర్భ శ్రీమంతుల ఇంటి గారాబు పట్టి. ఆమెకు దేనికీ కొదువ లేదు. ఆరోగ్యం, ఐశ్వర్యం ఆమె తోబుట్టువులు. మా మమ్మీ కనీసం జ్వరం కూడా రానంతటి ఆరోగ్యవంతురాలట. నాకు పన్నెనిమిదేళ్ళ వయసప్పుడు మా మమ్మీకి

తరచూ జ్వరం రావటం మొదలైంది. దానికోసమనే డాక్టర్లు అన్ని టెస్టులు చేశారు... చేసి ..." మైత్రి ఆగిపోయింది.


"చెప్పు మైత్రీ ..." సృజన్‌లో కుతూహలం.

"డాడీ వో సంవత్సరం వరకు మమ్మీకి ఆ విషయం తెలియనివ్వలేదు. మమ్మీ మామూలుగానే ఆనందంగా ఉండేది. మా ఫామిలీ డాక్టర్ని కూడా చెప్పవద్దన్నారు. కానీ ... వో రోజు హెల్త్ డిపార్టుమెంట్ వారు ... అంటే ఫైలేరియా డిపార్ట్‌మెంట్ వాళ్ళు ఇంటింటా బ్లడ్ టెస్ట్‌లు చేస్తున్నారు. డాడీ ఇంట్లో లేరు. మమ్మీకీ నాకూ కూడా టెస్ట్ చేశారు. నాకు, మమ్మీకి ఫైలేరియాసిస్ లేదు. కానీ ... కానీ ... అమ్మకు ఇప్పుడిప్పుడే దేహంలో శ్రవసీ జర్మ్ వృద్ధిపొందుతోందనీ వో పదేళ్ళలో డిసీజ్ పైకి కన్పడవచ్చునని చెప్పేశారు. నా గుండె ఆగిపోయింది. అమ్మ శిలా సదృశ అయింది. ఆరోజామె భోంచెయ్యలేదు. డాడీ రాగానే భోరున ఏడ్చింది. డాడీ అమ్మ వీపు నిమురుతూ 'సుమిత్రా! టేకిటీజీ ... ఇప్పుడు నీకు దాదాపు ముప్పయి అయిదేళ్ళుంటాయి. ఇంకో పదేళ్ళకు అంటే నీకు నలభై అయిదేళ్ళు వచ్చేనాటికి గాని వ్యాధి బయట పడదు. నలభై అయిదేళ్ళ వయసంటే ... ఇంకేముంది... అనుభవించాల్సిన ఆనందమంతా అయిపోయి మధురానుభూతుల్ని మనసు నెమరువేసే వయసు. అంతవరకూ ... బి హేపీ ...' అన్నారు.

అయినా అమ్మ వెక్కుతూనే ఉంది.

"చూడు, మిత్రా! నిన్ను ఫారెన్ కంట్రీస్ కయినా తీసికెళ్ళి రక్షించుకుంటాను. ఎన్ని రకాల ప్రివెంటివ్స్ లేవు! నీ దేహంలో ఉన్న ఆ మహమ్మారిని సమూలంగా నాశనం చేస్తాను." నాన్న అమ్మ కన్నీళ్ళు వత్తారు. ఆ కన్నీళ్ళు ఆగితేనా? అమ్మ అప్పటినుంచి అసలు మాట్లాడ్డమే మానేసింది.

చుట్టుమట్టూ ఒక గిరి గీసుకుని భయంకరమైన ఒంటరితనపు గూటిలో దిక్కులేని పక్షిలా జీవించడం అలవాటు చేసుకుంది. తన దగ్గరికి నీడను కూడా రానిచ్చేది కాదు. నాన్న అమ్మను మార్చాలని ఎంతగానో ప్రయత్నించి విఫలు లయ్యారు. మా మేనత్తకు ఈ విషయం ఎలాగో తెలిసిపోయింది. వచ్చి అమ్మను ఓదార్చింది. అమ్మ ఇన్‌సల్ట్ ఫీలయ్యింది. "నువ్వు చెప్పటంటే నీ చెల్లికెలా తెలిసింది?' అని డాడీని నిలవేసింది. నిజానికి ఆవిడకు డాడీ చెప్పలేదు. అత్తయ్యకూడా—"సుమిత్రా! నాకు వదినవు. తల్లిలాంటి దానవు. నే నెవరితో ఈ విషయం అనను. నన్ను నమ్ము. అదీగాక ఈ విషయం బయటకు తెలిస్తే మైత్రికి పెళ్ళవుతుందా? నే నంత ద్రోహం చేస్తానా?" అంది. అత్త మాటలకు అమ్మెందుకో చాలాసేపు ఆలోచించినట్లు ఉండిపోయింది. "నిజమే— నేను బతికుంటే మైత్రికి పెళ్ళవుతుందా? నా నీడలో మైత్రి బంగారు భవిష్యత్తు అణగారి పోతుంది. అందుకే నేను చచ్చిపోయి ఈ విషయాన్ని నా తోనే సమాధి చేస్తాను. నా బిడ్డ భవిష్యత్తుకు పునాది వేస్తాను' అన్నది అమ్మ ఆవేదనగా. డాడీ ఎంతగానో ధైర్యం చెప్పారు. అలాంటి పిచ్చి పనులు




చెయ్యవద్దని ఒట్టేయించుకున్నారు. కానీ. కానీ. అమ్మ ఆ రాత్రికే స్లీపింగ్ పిల్స్ మింగి ఆత్మహత్య చేసుకుంది." మైత్రి గొంతు పట్టినట్లుగా ఆగిపోయింది.

సృజన్ కాసేపు దీర్ఘంగా ఆలోచించాడు. తరవాత అన్నాడు—

"మైత్రీ! నువ్వు చెప్పినదాన్ని బట్టి నా కోటి అర్థమవుతోంది. నువ్వు పుట్టక ముందు మీ అమ్మగారి దేహంలో ఆ వ్యాధి లేదు. సో. అది నీకు సంక్రమించడానికి అవకాశాలు చాలా తక్కువ. శ్రవసీ అంటువ్యాధని కాదని డాక్టర్ల అభిప్రాయం. బైదిబై. నా దొక చిన్న రిక్వెస్ట్." ఆగి ఆమె వంక చూశాడు అర్థిస్తున్నట్టుగా.

"ఏమిటది?" మైత్రి తడిసిన రెప్పలు ఎత్తి చూసింది.

"నువ్వొకసారి బ్లడ్ టెస్ట్ చేయించుకోవాలి." సృజన్ వేడికోలుగా చూశాడు.

మైత్రి ఎందుకో విరగబడి నవ్వింది.

"ఎందుకు, సృజన్, నీ కీ ఆరాటం? ఏం. ఒకవేళ నా కా జబ్బు లేకుంటే నన్ను పెళ్ళి చేసుకుంటావా?" పెళ్ళి అన్న మాటను వొక్కి పలుకుతూ అన్నది.

"ఎగ్జాట్లీ." అతని స్వరం స్థిరంగా ఉంది.

"ఆ జబ్బు నా కుంటే?" మొండిగా చూసింది.

"అలా కాకూడదని నా ఆశ. నా ఆశ నెరవేర్చమని భగవంతుణ్ణి కన్నీటితో ప్రార్థిస్తున్నాను. మైత్రీ! నువ్వుకూడా నా తరఫున ఆ దేవుణ్ణి వేడుకుంటావా?" సృజన్ కళ్ళలో కన్నీటి పొర.

మైత్రి చిత్రంగా చూసిం దతన్ని. అతని కంటి కొలకుల్నుంచి జారిన ఒక్క కన్నీటి చుక్క ఆమె గుండె పొరలను వెచ్చగా తాకింది. అణగారిన అను భూతుల్ని తట్టి లేపింది.

"సృజన్! మై హార్ట్!" అస్పష్టంగా కదిలాయి ఆమె అధరాలు.

"కరెక్ట్. ఐ యామ్ యువర్స్ హార్ట్. యు ఆర్ మై లైఫ్!" సృజన్ తమకంతో అన్నాడు.

"ఎంత వరకు? రేపు బ్లడ్ టెస్ట్ చేయించుకునే వరకు. డాక్టరు రిపోర్టు వినేవరకు అంతేనా? ఆ తరవాత నా హార్ట్ హార్ట్ అవక తప్పదు. నీ లైఫ్ వేరొకరి సొత్తు అవకా తప్పదు." పిచ్చిదానిలా నవ్వింది మైత్రి.

• • •

తెల్లని యూనిఫారమ్‌లో ఉన్న నర్సు మైత్రి వెయిన్ లోంచి ఎర్రని రక్తాన్ని వెనక్కు లాగుతోంది.

"ఇప్పుడు వెనక్కి పోయేది వట్టి రక్తమేనా? నా ఆశలు, కలలు, కోరికలు ఎవ్విరిథింగ్. ఓహ్ నా భవిష్యత్తే జారి పోతుందేమో! ఏ వార్త వినవలసి వస్తుందోనని ఇంతవరకూ నేను ఇంట్రెస్టుగా ఏ టెస్టులూ చేయించుకోలేదు. అమ్మతో పాటే డాడీ పోవడంతో నా ఆరోగ్యాన్ని, నన్నూ పట్టించుకునే వారే లేకపోయారు. ఇన్నాళ్ళకు నువ్వు తయారైనావు. అబ్బ! ఎంత శ్రద్ధ నే నంటే." మైత్రి పెదవి వంట నొక్కుతూ సృజన్ వంక చూసింది.

నర్సు ఎందుకో చిత్రంగా. జాలిగా చూసింది మైత్రిని. సిరంజిలోని రక్తాన్ని టెస్ట్‌ట్యూబ్‌లోకి డ్రెయిన్ అవుట్ చేస్తూ.

మైత్రి కనురెప్పలు మూసుకుంది. ఎందుకో దీర్ఘంగా నిశ్వసించింది. క్షణాలు నిశ్శబ్దంగా జారి పోతున్నాయి. మైత్రి చప్పున కళ్ళు తెరిచి సృజన్ వంక చూస్తూ అన్నది—

"నాకేమైనా రోగముందేమో నని టెస్ట్ చేయిస్తున్నావు బాగుంది. కానీ. నీ దేహంలో ఏ అనారోగ్యం లేదా? ఆర్ యు పర్ఫెక్ట్?"

సృజన్ చివుక్కున చూశాడు మైత్రి వైపు.

"మగవాడివనిపించుకున్నావ్. ఎందుకలాగ మిర్రి చూస్తావ్? శల్య పరీక్షలన్నీ ఆడదానికేనా? నువ్వు కూడా టెస్ట్ చేయించుకో." అల్లరిగా నవ్వింది.

"చేయించుకోరాదటోయ్. ఏ ఫైలేరియానో ఉండనుకో. ప్రివెంటివ్స్ వాడవచ్చును కదా! ఇప్పుడు ఫైలేరియా అనేది ఎవరికి బట్టినా వస్తూంది." డాక్టర్ రాఘవ్ నవ్వుతూ అన్నాడు. అతను సృజన్ ఫామిలీ డాక్టర్.

"ఫూ. మీకు ఫీజుకూడా బాగానే ముడుతుంది." సుజన్ చిరుకోపంతో అన్నారు.

"నీ ఫీజు నే ఇస్తాలే." కొంటెగా నవ్వింది మైత్రి.

"అసలు నేను ఫీజు పుచ్చుకోనులే." మైత్రికి డాక్టర్ వత్తాసు వచ్చాడు.

సృజన్ ముఖంలో అవమానం స్పష్టంగా కనిపించింది. "మైత్రీ! అసలేమిటి నీ ఉద్దేశ్యం?" కోపంగా అన్నాడు.

మైత్రికి మనసు చివుక్కుమంది. తనేదో అల్లరిగా అంటేనే అతని కింత కోపమా? మరి తనకైతేనేమో అతను బలవంతంగా టెస్ట్ చేయిస్తున్నాడు. తనేమైనా కోప్పడిందా? ఈ విషయాన్ని తను ఎంతో స్పోర్టివ్‌గా తీసుకుంది!ఇది తను అవమానంగా భావించలేదే! మరి అతనెందుకలాగ ఫీలవుతున్నారు ? పురుషాహంకారమా?

మైత్రికి మనసు చేదుగా అనిపించింది. సృజన్ని చూస్తుంటే చెప్పలేనికోపంముంచుకొచ్చింది.

"సృజన్! ఇందాక నేను గమ్మత్తుగా అన్నాను. కానీ ఇప్పుడు నిజంగా అంటున్నాను. నువ్వుకూడా టెస్ట్ చేయించుకు తీరాలి." సృజన్‌కి మాత్రం వినిపించేలా దృఢంగా అన్నది.

సృజన్ భృకుటి ముడిపడింది. దవడ ఎముక కదలాడింది. ఒక్క నిమిషం పాటు ఏదో దీర్ఘంగా ఆలోచించాడు. క్రమంగా అతని ముఖం ప్రసన్నంగా మారింది.

"ఆల్‌రైట్,డాక్టర్! నన్నుకూడా చెకప్‌చేయండి" అన్నాడు చేయి ముందుకు చాచి.

మైత్రి ఆరాధనగా చూసింది అతని వంక. ఆమె కళ్ళలో కోటి మెరుపులు ఒక్కసారి గా తళుక్కుమన్నాయి. "సృజన్ నా మాటకు విలువ ఇచ్చాడు. ఇది తనను అభిమానిస్తున్నందుకు నిదర్శనం కాదా?" మైత్రి మనసు పురి విప్పిన మయూరమై నర్తించింది.

"ఓ. గాడ్! ఇది చాలు. నా కీ తృప్తి చాలు. ఇక ఎంతటి అశనిపాతమైన వార్త అయినా నన్ను కదిలించ లేదు. ఒక వేళ. ఒక వేళ. మన్మోగనే నాకు పట్టినా నేను చావను. నా సృజన్ తలపులతో జీవితాన్ని సాగిస్తాను. అతన్ని దూరం నుంచయినా చూసుకుని ఆ అనుభూతుల్లోనే బతుకుతాను." మైత్రి కళ్ళు పరవశంగా మూసుకున్నాయి. ఆమె ముఖం నిండా ఏదో సంతృప్తి.

నర్స్ సృజన్ వెయిన్‌లోంచి రక్తం తీస్తుంటే అతనెందుకో మైత్రి వంక క్రీగంట చూశాడు. అతని ముఖంలో ఏ భావాలు కదలాడాయో మైత్రికి అర్థం కాలేదు.

•   •   •   •

"డాక్టర్! మీరు. మీకు పొరబడటం లేదు కదా!" సృజన్ గొంతు ఉద్వేగంతో వణికిపోతూంది. అప్పటికప్పుడే అతని నుదుట చిరుచెమటలు అలుముకున్నాయి.

"సారీ, మై బోయ్!" రాఘవ్ బాధగా తల విదిలించాడు.

మైత్రి మనసు శిలాసదృశ్యమై పోయింది. ఆమె కళ్ళ నుంచి నీటిచుక్కకూడా రావటం లేదు. నీరెండిన కళ్ళతో, బండబారిన గుండెతో ఉన్మాదినిలా చూస్తూంది సృజన్ వైపు.

సృజన్ టేబుల్ మీదున్న పేపర్ వెయిట్‌ను అదే పనిగా తిప్పుతున్నాడు. అతని నుదుట నుండి స్వేదం జారి చుక్కలుగా పడుతూంది. వాటితో కన్నీటి చుక్కలుకూడా ఉన్నాయేమో!

"డాక్టర్‌గారూ! మీరు జాగ్రత్త గా చూశారా? ఒక వేళ నా బ్లడ్. అతని బ్లడ్ తారుమారు కాలేదు కదా?" మైత్రిఆత్రంగాఅడిగింది. సృజన్ చటుక్కున తలెత్తి ఆశగా చూశాడు డాక్టర్ వంక.

రాఘవ్ ముఖంలో ఏవో భావాలు కదిలిపోయాయి.

"మీరు నన్ను ఇన్‌సల్ట్ చేస్తున్నారు. డ్యూటీలో అవకతవకలు చేయటానికి నేను చదలచిత్తుణ్ణి కాను. మీ కంత నమ్మకం లేకుంటే మీ ఇష్ట మొచ్చిన చోటికి వెళ్ళి చెకప్ చేయించుకోండి. ప్లీజ్ గో ఎవేర్."

"డాక్టర్! మీ మీద నమ్మకం లేక కాదు. నా మీద నాకే నమ్మకం లేక" సృజన్ కళ్ళలో గిర్రున తిరిగింది కన్నీరు,

డాక్టర్ జాలిగా చూశా డతని వైపు.

"సృజన్! ఇలాగ చూడు. జీవితంలో ఏదైనా



ఎదురు దెబ్బ తగిలితే ధైర్యంగా ఎదురు నిలవాలికానీ, పిరికివాడిలా పారిపోకూడదు."

"ఆ ఎదురు దెబ్బ తేరుకోలేని దైన్యుడు ధైర్యం ఎందుకిక?"

"తేరుకోలేని దని ఎవరన్నారు? నీ వ్యాధి ఎర్లీ స్టేజిలో ఉంది. శ్రద్ధగా ట్రీట్‌మెంట్ తీసుకో. నువ్వు తప్పక రికవర్ అవుతావు."

సృజన్ నిశ్శబ్దంగా లేచాడు.

"వస్తా డాక్టర్" అంటూ క్లినిక్ బయటకు ఎవరో తరుముతున్నట్టు నడిచాడు.

ఆ నడక మరి ఆగలేదు. అలా సాగుతూనే ఉంది.

చల్లని గాలి అతన్ని జాలిగా స్పృశిస్తుంటే, పాదాల కింద ఇసుక అలల వేగానికి జారి పోతుంటే, ఉలిక్కి పడి ఆగిపోయాడు.

ఎదురుగా కడుపులో బడబాగ్ని దాచుకున్న సముద్రం. బాధ భరించలేక కాబోలు వెర్రిగా అలలు లేస్తూ వస్తూంది. మరి తిరుగుతూ హోరు మని ఘోషిస్తూంది.

ఓ. అనంత సాగరమా! నా కోసమేనా హృదయ ఘోష? ఓ మౌన మలయానిలమా! నామీద జాలేనా నీ నిట్టూర్పుల భాష?" సృజన్ పెదవుల మీద చిరునవ్వు తళుక్కున మెరిసింది. నా బాధలోంచి భావుకత వస్తుంది. కన్నీటితో కవిత్వం ఆవిర్భవిస్తుంది. ఎంత నిజం!

గాలి హోరును, కడలి ఘోషనూ మించిపోతూ ఎవరిదో అడుగుల సవ్వడి. చప్పున తల తిప్పి చూశాడు సృజన్.

ఎదురుగా మైత్రి.

"మైత్రీ! ఇంటి కెళ్ళలేదా?" తలతిప్పుకుంటూ అడిగాడు.

"నా ఇల్లు ఇక్కడే!" మైత్రి వేలుతో చూపింది ఇసుకమీద.

సృజన్ చిత్రంగా చూశా డామె చూపిన వేపు.

"ఇది నా అడుగుజాడ. ఇటీజ్ మై ఫుట్‌ప్రింట్. అతని అధరా లెందుకో కంపించాయి. ఇసుకలో అతని పాదముద్రను చెరపబోయాడు. మైత్రి చప్పున అతని చెయ్యి పట్టుకుని పెదవుల కానించు కుంది.

"అవును. ఇది నీ అడుగు జాడే. అంతేకాదు నేను కొలువుండ బోయే పూరిమేడకూడా!"

"మైత్రీ! నే నెవర్నో తెలుసా?"

"తెలుసు. నా హృదయం గురించి నాకు గాక ఇంకెవరికి తెలుస్తుంది?. నా ప్రాణం గురించి ఒకరు నాకు చెప్పేదేమిటి?"

"ఓ. మైత్రీ! మైత్రీ. నీకు పిచ్చి పట్టలేదు కదా! నేను. నేను. లెప్రసీ పేషెంట్ని."

"అంతేకాదు, సృజన్, నా ప్రాణనాథుడివి." మైత్రి చప్పున మోకాళ్ళ మీద కూలబడింది అతని ఎదురుగా.

"మైత్రీ!నన్ను ఇన్‌సల్ట్ చేస్తున్నావా? ప్రేమంటే నీకు తెలియదూ. ఇదిగో ఇలాగ ఉండాలని చెబుతున్నావా? నన్ను అనుమానించినందుకు అవమానం చేస్తున్నావా, మైత్రీ? వద్దు. దేవుడే నాకు శిక్ష వేశాడు. నువ్వింకా శిక్షించకు. చిత్రవధ చెయ్యకు." చటుక్కున లేచాడు సృజన్. ఒక అడుగు ముందుకు వేశాడు.

"సృజన్!" చప్పున అతని చెయ్యి తన చేతిలో బిగించింది.

"మైత్రీ! నువ్వు అదృష్టవంతురాలివి. ఈ దురదృష్టవంతుణ్ని మరిచిపో! నా నీడకూడా నీ మీద పడదు. హాయిగా పెళ్ళి చేసుకుని ఆయురారోగ్యాలతో నువ్వు విలసిల్లాలి. ఈ నిర్ణయం నాదే కాదు. దేవుడిదికూడా. యస్. ఇటీజ్ గాడ్స్ డెసిషన్."

"సృజన్! నువ్వు నిర్ణయించేందే నా జీవితమా? కాదు. నాకూ భావస్వాతంత్ర్యం ఉంది. నా జీవితం మీద నాకూ హక్కుంది. నువ్వు వెళ్ళబోయే ముందుగా నా నిర్ణయంకూడా విను. నేను నిన్ను తప్ప మరొకర్ని పెళ్ళాడలేను. మన పెళ్ళి జరిగి తీరాలి. నువ్వనుక్షణం జపించే నీ భగవంతునికి దయవుంటే నీ కీ వ్యాధినుంచి విముక్తి కలుగుతుంది. లేదా ఈ వ్యాధి తన వికృత రూపాన్ని బయట పెట్టడానికి కొన్నేళ్ళు పడుతుంది కదా! ఈ కొద్ది జీవిత మాధుర్యాన్నంతా చవి చూద్దాం. అంతులేని అనుభవాల్ని, అంతమైన అనుభూతుల్ని పంచుకుందుకు ఆ సమయం చాలు. ఆ తరవాత ఇద్దరం ఒక్కసారే చచ్చిపోదాం, ఇంతకన్నా ఇంకేం కావాలి మనకు? ఈ లోకంలో మరే ప్రేమికులకీ లభించని అదృష్ట మిది. విన్నావుగా నా నిర్ణయం. దీన్ని దేవుడు కూడా మార్చలేడు. మనసారా ఆశీర్వదిస్తాడు." మైత్రి స్వరం ఉద్వేగంగా ఉంది. ఆమెలోని ప్రతి అణువూ చిత్రంగా కంపిస్తూంది.

సృజన్ కొద్ది క్షణాలపాటు దీర్ఘంగా మైత్రి కళ్ళలోకి చూస్తూండిపోయాడు. చాలా సేపటి తరవాత అన్నాడు.

"మైత్రీ! నీ నిర్ణయాన్ని దేవుడు మార్చలేక పోవచ్చు. కానీ నేను మార్చగలను. ఎలాగో తెలుసా? నా కంఠంలో ప్రాణముండగా మన పెళ్ళి జరగదు. అసలు నీ కంటికికూడా కనిపించను. అప్పుడేం చెయ్యగలవు నువ్వు?" నిశ్చలంగా, నిశ్చయంగా ఉందతని స్వరం.

"ఓహో. హెల్ విత్ యు. నీ తోడుంటే నూరేళ్ళు కాకున్నా మూన్నాళ్ళయినా బతికేదాన్ని. నా నుదుట ఈ క్షణమే చావాలని వ్రాసి ఉంటే ఎవరు తప్పించగలరు? నువ్వేంటో అన్నావు. నేనేమిటో అనుకున్నాను. కానీ అసలైన భగవన్నిర్ణయం ఇదే నా చావు". మైత్రి గిరుక్కున వెనుతిరిగి సాగరం వైపుగా అడుగు వేయబోయింది. స్ప అడుగు పడలేదు.

ఎలా పడుతుంది ఆమె కొంగు సృజన్ చేతిలో చిక్కడి ఉంటే!

మైత్రి చప్పున వెనుదిరిగింది. "సృజన్!" మైత్రి గొంతు పూడిపోయింది దుఃఖోద్వేగంతో. ఆమె హృదయం ఆనందార్ణవమై పోయింది. హిమ నగాలు కరిగి కుదిపినట్టు ఆమె కళ్ళనించి అశ్రువులు ధారలు కట్టాయి.

"మైత్రీ! ఏడుస్తున్నావా? ప్రేమ అర్థం తెలియ జెప్పిన నిన్ను విడిచి నేను వెళ్ళగలనా? వెళ్ళినా మనగలనా?" ఆర్తిగా హృదయానికి హత్తుకున్నాడు.

"ఓ. సృజన్! నీ కెలా చెప్పను? ఇది ఏడుపు కాదు. నవ్వు. ఇదికూడా ఒక నవ్వే. ఈ నవ్వు కన్నీళ్ళలో వెలుగుతుంది. బాధల్లో మెరుస్తుంది. ఈ నవ్వు వినిపించేది మనసెరిగిన మనసుకే." మైత్రి కంటి కొసల్నుంచి కోటి వెలుగులతో తళుకోటి తళుకులతో చప్పున రాలింది ఒక కన్నీటి చుక్క. కాదు కాదు. వెలుతురు చుక్క. ★

## త్యాగరాగం



జి. బాపురెడ్డి

వదులుకొంటి ఒకటి ఒకటి
వ్యసనాలన్నీ
ఏముందిక వదలుటకై
ఈ లోకంలో!
మతితప్పి పోతుందని
మధుపానం మానితి
మధుర మోహం వస్తుందని
మధుర రుచులు వదలితి—
పెద్ద పేరు వస్తుందని
శృంగారం వదలితి
చట్టాలను గౌరవించి
పరదారలను మానితి —
రూకలకై గడ్డితినే
జాకీల మోసాలకు
గుండె పగులునని వదలితి
గుర్రపు పందాలను —
ఊపిరితిత్తులకోసం
పొగ త్రాగుట మానితి
రక్తపోటునకు వెరచి
రాగద్వేషముల వదలితి